కన్నుల పండువగా గాదిలింగేశ్వర, గురు కాడ సిద్ధేశ్వర స్వాముల

# రథోత్సవాలు ఊరేగింపు

- జోడు రథోత్సవాలను చూడడానికి తరలివచ్చిన కర్ణాటక,ఏపీ భక్తులు..
- భారీగా బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు..

**హాలహర్వి,మేజర్ న్యూస్ :** హాలహర్వి మండలంలోని గూళ్యం గ్రామంలో వెలసిన కొలిచే వారికి కొంగు బంగారంలా నిలిచినశ్రీగురు కాడ సిద్దేశ్వర, శరణు గాదిలింగేశ్వర స్వాముల రథోత్సవాలు అశేష భక్త జన సందోహం మధ్య అట్టహాసంగా ఊరే గించారు.మంగళవారం గ్రామంలో వెలసిన గాదిలింగేశ్వర స్వామికి ఉదయం అభిషేకాలు, నైవేద్యాలతో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.కుంకుమార్చన ,రుద్రాభిషేకం,మహా మంగళ హారతులు ఇచ్చి పూలమాలలతో స్వామి వారిని అలంకరించారు. అనంతరం కర్ణాటక,ఆంధ్ర ఇతర చుట్టుపక్కల ప్రాంతాల నుండి వచ్చిన భక్తుల మధ్య మిగతా 2లో



అశేష భక్తజనం మధ్య ఊరేగుతున్న గాదిలింగేశ్వర స్వామి రథోత్సవాలు

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com


కర్నూలు | నంద్యాల
బుధవారం | 05 మార్చి 2025 పేజీలు 8

## కాసులకు కక్కుర్తి..
# ప్రత్యర్థులకు సిఫారసు..!

- పనులన్నీ వైసిపి కార్యకర్తల కంటూ ఛోటా నేతల గగ్గోలు
- ఎమ్మెల్యేల వద్ద తలలు పట్టుకుంటున్న అధికారులు



**కర్నూలు,సూర్య ప్రతినిధి :** గ్రామ సచివాలయం నుంచి రాష్ట్ర సచివాలయం వరకు ప్రస్తుతం ఒకటే వాదన విని పిస్తోంది.కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు దాటినా ఇంకా వైసిపి కార్యకర్తల పనులే జరుగుతున్నాయని కూటమిలోని మూడు పార్టీల నేతలు భగ్గుమంటున్నారు. ఈ ఆగ్రహావేశాలు స్థానిక ఎమ్మెల్యే నుంచిరాష్ట్ర ముఖ్య మంత్రి వరకు ఎదుర్కొంటూనే ఉన్నారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు కూడా అలాగే ఉన్నాయి. ఆర్థిక మంత్రికి తెలియకుండా కోట్లాది రూపాయల బిల్లులు గత ప్రభుత్వంలో పనలు చేపట్టిన కాంట్రాక్టర్లకు చెల్లించిన ఘటనలు సైతం ఉన్నాయి. ఇక జిల్లా మండల స్థాయిలో సైతం ఆయా శాఖల అధికారులు వైసిపి కార్యకర్తలకు చేసినట్లుగా కూటమి పార్టీల నేతలకు పనులు చేయడం లేదని స్థానికంగా ఉన్న నాయకులు అనేక మంది ఎమ్మెల్యేలు, మంత్రుల వద్ద తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. ఈ వ్యవహారం రాష్ట్ర స్థాయి నేతలకు తలనొప్పిగా మారింది. దీనిపై ఎమ్మెల్యేల నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు విచారణ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటికీ వైసిపి నేతలకు పనులు ఎలా జరుగుతున్నాయనే విషయంపై ప్రధానంగా విచారణ జరిగింది. వైసిపి నేతలు, కార్యకర్తలకు పనులు చేశారన్న కారణంగా ఆయా అధికారులపైనే ప్రధానంగా విచారణ జరిగింది. మిగతా 2లో

# కేసీ కాల్వకు నిలిచిపోయిన సాగునీరు

**నంద్యాలఅర్బన్, మేజర్‌న్యూస్ :** కేసీ కాల్వకు సాగునీరు నిలిచిపోయింది. జిల్లాలో కెసి కెనాల్ కింద ప్రధాన పంటలైన వరి, మిరప, తదితర పంటలకు రెండు, మూడు తడుల నీరు అవసరం అవుతోంది. ఈ దశలో కాలువకు నీరు నిలిపివేయడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నంద్యాల జిల్లాలో సుమారు 25 వేల మిగతా 2లో



పొట్ట దశలో ఉన్న వరి పంట

- 25 ఎకరాల్లో వరి,మిరప పంటలు ప్రశ్నార్థకం
- ఆందోళనలో అన్నదాతలు
- 20 రోజుల పాటు నీరందిస్తే వేసిన పంట చేతికి వచ్చే అవకాశం



బనకచెర్ల హెడ్ రెగ్యులేటర్



కేసీ కెనాల్ దృశ్యం

# రెవెన్యూ అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

- రైతులకు ఇబ్బందులు కలగకుండా భూరీ సర్వే పక్కాగా నిర్వహించాలి
- కర్నూలు జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా



వెల్దుర్తి తహశీల్దార్ కార్యాలయంలో అధికారులకు సూ,నలు చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్:** రెవెన్యూశాఖకు సంబంధించి వచ్చే అర్జీలను గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి .రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం వెల్దుర్తి తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌కి సంబంధించి వెల్దుర్తి మండలంలో మిగతా 6లో

## అహోబిలంలో ప్రారంభమైన
# అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు



విశ్వక్సే నుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో మంగళవారం రాత్రి 8గంటలకు అంకురార్పణతో అహోబిలమఠం 46వ పీఠాధిపతి శ్రీవన్ శఠగోపరంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతం కావాలని విఘ్నేశ్వరుడి పూజించే తరహాలో వైష్ణవక్షేత్రమైన అహోబిలంలో సేనాధిపతిగా భావించే విశ్వక్సేనునికి పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా విశ్వక్సేనునికి ప్రత్యేక అలంకరణలు నిర్వహించి ఆలయం నుంచి సమీపంలో ఉన్న పుట్టబంగారు మండపానికి తరలించి పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ పరిసరాల్లో మిగతా 2లో

## కల్వటాల గ్రామ సమీపంలో
# ఆర్టీసీ బస్సు బోల్తా

2లో






ప్రయాణికులను రక్షిస్తున్న పోలీసులు

## కర్నూలు జెఎఫ్‌సిఎం కోర్టుకు
# పోసాని కృష్ణమురళీ

2లో



పోసాని కృష్ణ మురళిని జడ్జి వద్దకు తీసుకొని వస్తున్న పోలీసులు

సూర్య



కన్నుల పండుగగా గాదిలింగేశ్వర, గురు కాడ సిద్దేశ్వర స్వాముల

# రథోత్సవాలు ఊరేగింపు

(మొదటి పేజీ తరువాయి)

స్వామి వారికి పల్లకి ఉత్సవం నిర్వహించి సాయంత్రం మంగళ వాయిద్యాల మధ్య ఆలూరు సిఐ వెంకటా చలపతి ఆధ్వర్యంలో ఎస్సై లు చంద్ర,దిలీప్ కుమార్,సతీష్,బాల నరసింహులు, ఇతర పోలీసు సిబ్బంది బందోబస్తు మధ్య స్వాముల వారి జోడు రథోత్సవాలు ఊరేగించారు. స్వామి వారిని దర్శించుకువడానికి ఎంపి నాగరాజు,టీడీపీ ఇంచార్జ్ వీరభద్ర గౌడ్,రఘురెడ్డి,డిసిసి ప్రెసిడెంట్ మిక్కిలినేని ప్రసాద్ ఇతర టీడీపి నాయకులు ప్రత్యేక పూజలు చేసి రథోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## కల్వటాల గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సు బోల్తా





**కొలిమిగుండ్లమేజర్,న్యూస్:** కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామ సమీపంలో కడప జిల్లా జమ్మలమడుగు డిపోకు చెందిన హయర్ బస్సు తాడిపత్రికి వెలుతుండగా అదుపుతప్పి సుమారు 10 అడుగుల లోతులో పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెలితే జమ్మలముదుగు డిపోకు చెందిన హయర్ బస్సు తాడిపత్రికి వెలుతుండగా కల్వటాల గ్రామం దాటిన తర్వాత అదుపు తప్పి బోల్తా పడింది బస్సు బోల్తా పడిన విషయం తెలుసుకు న్న సి.ఐ రమేష్‌బాబు తన సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని బస్సులో ఇరుక్కొనిపోయిన ప్రయాణికులను బయటకు తీసుకువచ్చారు. సంఘటన స్థలానికి కొలిమిగుండ్ల, అవుకు, సంజామల మండలాల నుండి మూడు 108 వాహనాలు రాంకో సిమెంట్ పరిశ్రమ అంబులెన్స్‌ను కలిసి ఘటనాస్థలానికి చేరుకొని కొలిమిగుండ్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం అవుకు, బనగానపల్లె, కర్నూలు ప్రభుత్వాసుపత్రికి క్షతగాత్రులను తరలించారు. ప్రమాదం జరిగిన బస్సులో 30మంది ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న వెంటనే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులను, కలెక్టర్ సృజనను ఆదేశించారు. వీరిలో నందిపాడు గ్రామానికి చెందిన సుబ్బలక్ష్మమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు వాపోతున్నారు.

## కర్నూలు జెఎఫ్‌సిఎం కోర్టుకు పోసాని కృష్ణమురళీ

**14 రోజులు రిమాండ్ విధించిన జెఎఫ్‌సిఎం కోర్టు జడ్జి**

**పోసాని కృష్ణ మురళిని ఆదోని సబ్ జైలుకు తరలించిన పోలీసులు**

**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారి కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా దూషించారని ప్రముఖ నటుడు,రచయిత పోసాని కృష్ణమురళిను ఏపి పోలీసులు అరెస్టు చేసిన విషయం పాఠకులకు విధితమే. అయితే గత ఏడది నవంబరు 14న వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు జనసేన ఆదోని పట్టణ అధ్యక్షులు మలిశెట్టి రేణువర్మ కర్నూలు జిల్లా ఆదోని త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో క్రైం నెం : 119/2024 యు/ఎస్ 192,353(1)(సి),353(2) బిఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేయడం జరిగింది. అందులో భాగంగా పోసాని కృష్ణ మురళిని అప్పగించాలని గుంటూరు జిల్లా పోలీస్ సిబ్బందిని ఆదోని పోలీసులు పిటి వారెంట్ ద్వారా కోరడంతో పోసానిని గుంటూరు జైలు నుంచి మధ్యాహ్నం 3గంటలకు ఆదోనికి తరలించేందుకు కర్నూలుకు తీసుకొచ్చారు. మంగళవారం రాత్రి కావడంతో పోసాని కృష్ణ మురళిను కర్నూలు పట్టణంలోని వెంకట రమణ కాలనీలో ఉన్న పున్నమి రెస్టారెంటు పక్కన ఉన్న జెఆర్ రెసిడెన్సీ అపార్టుమెంటులో కర్నూలు జెఎఫ్‌సిఎం కోర్టు జడ్జి ఇంటి ముందు హాజరు పరిచారు. ఈ మేరకు జడ్జి 14రోజులు రిమాండ్ విధించారు. దీంతో కర్నూలు,ఆదోని పోలీసులు పోసానిని ఆదోని సబ్ జైలుకు తరలించడం జరిగింది.

# కాసులకు కక్కుర్తి.. ప్రత్యర్థులకు సిఫారసు..!

(మొదటి పేజీ తరువాయి)

ఈ విచారణలో వైసిపి కార్యకర్తలకు పనులు చేసిన అధికారులు ఆ పనులు చేయడానికి ప్రధాన కారణం కూటమి నేతలేనని స్థానిక ఎమ్మెల్యేల నుంచి ముఖ్యమంత్రి వరకు వివరణ ఇచ్చారు. ఏ పనులు ఏ నాయకుడి సిఫారసు మేరకు పనులు చేశామో వారు విచారణ సందర్భంగా కూటమి నేతలకు వివరాలు సమర్పించుకున్నారని తెలుస్తోంది. ఇందులో 90శాతం పనులు కూటమి నేతల్లో ఎవరో ఒకరు సిఫారసు చేసినవి కాగా మిగతావి కొందరు అధికారులు గతంలో ఉన్న పరిచయాల మేరకు వైసిపి కార్యకర్తల కోసం చేసినవిగా తేలింది. దీంతో కూటమిలోని మూడు పార్టీల నేతలు తమ పార్టీ నేతలు ఇలా ఎందుకు సిఫారసు చేశారన్న అంశంపై కూడా విచారణ నిర్వహించినట్లు సమాచారం. రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోట్లనే ఎక్కువగా వైసిపి కార్యకర్తలకు సంబంధించిన పనులు జరిగినట్లు గుర్తించారు. ఇందుకు ప్రధాన కారణంగా మూడు పార్టీల నాయకులే కాకుండా తెలుగుదేశం పార్టీలో కూడా రెండు, మూడు వర్గాలు ఉండటంతో వైసిపి కార్యకర్తలతు తెలివిగా వ్యవహరించి కూటమి నేతల సహకారంతో తమ పనులు చక్క బెట్టుకున్నారని స్పష్టమవుతోంది. అవసరమైతే ఆయా పార్టీల నేతలకు, అధికారులకు ముడుపులు కూడా ఇచ్చి తమ పనులు చక్క బెట్టుకున్నట్లు వెల్లడైనట్లు కూటమి పార్టీల నేతల ద్వారా తెలుస్తోంది. ఇక అనేక నియోజకవర్గాల్లో గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాల కారణంగా కేసులు ఎదుర్కొంటున్న వారికి సైతం అనేక నియోజకవర్గాల్లో క్లీన్ చిట్ లభించేలా అధికారులు సాయపడినట్లు కూటమి నేతల విచారణలో స్పష్టమైంది. ఇందుకు ప్రధాన కారణం కూటమిలో ప్రధాన పార్టీ అయిన తెలుగుదేశం పార్టీలో రెండు, మూడు వర్గాలు ఉండటం ఒకటైతే ఎన్నికలకు కొద్ది రోజులు ముందు వైసిపిని వీడి టిడిపి, బిజెపి, జనసేనలో చేరిన వారు మరో కారణమని తెలుస్తోంది. మూడవది అత్యధికంగా ప్రభావం చూపిన అంశం ముడుపులు చెల్లింపు అని స్పష్టమైనట్లు తెలిసింది. తెలుగుదేశం పార్టీలో ఉన్న వర్గాల కారణంగా తమ పరపతిని చూపుకోవడానికి తమ వద్దకు ఎవరు వచ్చినా అధికారులకు ఫోన్ చేసి వారి పనులు చేయాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు కూడా వచ్చిన వారు ఎవరైనా కూటమి నేతల్లో ఒకరు ఫోన్ చేయడం వచ్చిన వ్యక్తులు తమను సంతృప్తి పర్చడంతో వైసిపి కార్యకర్తల పనులు సాఫీగా జరిగిపోవడానికి కారణంగా తెలిసింది. ఇక ఎన్నికలకు ముందు వైసిపి ని వీడి కూటమి పార్టీలో చేరిన వారు ఎన్నికల తరువాత అంతకు ముందు తమతో కలిసి పని చేసిన నాయకులు, కార్యకర్తలకు సహాయం చేశారని తేలింది. మొత్తం విచారణలో ప్రధానంగా ఆర్థిక పరమైన కారణాలతోనే వైసిపి నేతలు, కార్యకర్తలకు సంబంధించిన పనులు జరిగాయని తేలడంతో ఆయా పార్టీల నేతలు తమ పార్టీకి చెందిన మండల స్థాయి నేతలను హెచ్చరించి మరో మారు ఇలా చేస్తే వ్యవహారం తీవ్రంగా ఉంటుందని చెప్పి మున్ముందు వైసిపి కార్యకర్తలు ఎవరు, టిడిపి కార్యకర్తలు ఎవరన్నది అధికారులు కూడా క్రాస్ చెక్ చేసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. దీంతో ఇక వైసిపి నేతల ఎత్తులకు కూటమి నేతలు అడ్డుకట్ట వేసినట్లేనని టిడిపి కార్యకర్తలు ఆనందపడుతున్నారు.

# కేసీ కాల్వకు నిలిచిపోయిన సాగు నీరు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి 30 వేల ఎకరాలలో వరి, మిరప పంటలు సాగు చేస్తున్నారు. కెసి కెనాల్‌కు సాగునీరు నిలిచిపోవడంతో పంటల పరిస్థితి ప్రశ్నార్ధకంగా మారిపోయింది. కనీసం మరో 20 రోజుల పాటు నీరందిస్తే వేసిన పంటలు రైతన్న చేతికి వచ్చే అవకాశం కనిపిస్తోంది.. పంటల సాగుకు ఒక్కొక్క ఎకరాకు ఎరువుల మందులు 10 నుంచి 12 బస్తాల కాంప్లెక్స్ ఎరువులు, మూడు నుంచి నాలుగు సార్లు పురుగుల మందులు రైతులు పిచికారి చేశారు. రైతులకు ఎకరానికి రూ.40 నుంచి 50 వేల వరకు పెట్టుబడి పెట్టారు. పంటలకు సాగునీరు అందకపోతే రైతులు రూ.90 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడుల కోసం బయట నుంచి అప్పులు చేసి పెట్టిన పెట్టుబడితో పాటు పొలానికి కౌలు చెల్లించాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో రబీ పంటలు సాగు చేస్తున్న రైతన్నలకు జలవనరుల శాఖ అధికారులు షాక్ ఇచ్చారు. ముందస్తు సమాచారం లేకుండా కేసీ కెనాల్‌కు సాగునీటిని అధికారులు నిలిపి వేశారు. దీంతో కేసీ కాల్వ కింద వరి, మిరప, మొక్కజొన్న, తదితర పంటలు సాగు చేసే రైతన్నల పరిస్థితి తీవ్ర ఆందోళన కరంగా మారింది. జిల్లాలో రైతన్నలు వరి పంటలను భారీ ఎత్తున సాగు చేస్తున్న విషయం ప్రజాప్రతినిధులకు, జలవనరుల శాఖ అధికారులకు తెలుసు. అయినా వరి పంట పొట్ట దశకు వచ్చే సమయంలో సాగు నీరు నిలిపి వేయడంతో రైతులు భారీ ఎత్తున నష్టపోయే అవకాశం ఉంది. జలవనరుల శాఖ అధికారులు కేసీ కాలువకు సాగునీరు ఇవ్వడంలో చేతులు ఎత్తేయడంతో అధికారుల తీరుపై పలువురు రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో బండి ఆత్మకూరు, నంద్యాల, గోస్పాడు, శిరివెళ్ళ, ఆళ్ళగడ్డ, దొర్నిపాడు, తదితర మండలాల్లో రబీ సీజన్‌లో సుమారు 25 వేల నుంచి 30 వేల ఎకరాలలో వరి, మిరప, తదితర పంటలు సాగు చేస్తున్నారు. కేసీకి నీటిని నిలిపి వేయడంతో ఒక్కొక్క ఎకరాకు రూ.90 వేల నుంచి లక్ష వరకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కేసీ అధికారులు రైతుల పరిస్థితిని ఆలోచించి సాగునీరు విడుదల కొనసాగించాలని కోరుతున్నారు.

**మంత్రులు-ప్రజాప్రతినిధుల దృష్టికి సాగునీరు నిలుపదల- మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి:** జిల్లాలో కేసీ కెనాల్ రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను జిల్లా మంత్రులైన ఫరూక్, బీసీ జనార్ధన్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్ళడంతో పాటు ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, అఖిల ప్రియల దృష్టికి మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి తీసుకెళ్ళారు. ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్ళి అసెంబ్లీలో చర్చించాలని కోరారు. తెలంగాణా రాష్ట్ర అభ్యంతరాలతో పోతిరెడ్డిపాడు, బనకచెర్ల హెడ్ రెగ్యులర్ ద్వారా నీటి సరఫరాను నిలిపి వేసిన విషయాన్ని ఇరిగేషన్ అధికారులు తెలిపినట్లు మంత్రులకు వివరించారు.



తులసిరెడ్డి

# అహోబిలంలో ప్రారంభమైన అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

ఊరేగించారు. అనంతరం మహాసంకల్పం, శుద్ధపుణ్యః వచనం నిర్వహించారు. ఒక వైపు వేదపారాయణం నిర్వహిస్తూ భూదేవిని ప్రార్ధించి పుట్టబంగారు మండంపం వద్ద సేకరించిన మట్టిని మృతికాసుక్తం అనంతరం దేవస్థానం అర్చకులకు అందజేశారు. ఈ మట్టిని మట్టిపాత్రల్లో నవధాన్యాలను కలిపి ఆలయంలో ఉంచి బ్రహ్మోత్సవ వేడుకలకు వినియోగిస్తారు. ఈ సందర్భంగా ప్రధానఅర్చకుడు వేణుగోపాల్ మాట్లాడుతూ ఉత్సవాల ఆరంభంలో భాగంగా ఎగువ అహోబిల యాగశాలలలో అంకురహోమం, రక్షాబంధనం, సోమకుంభస్థాపన కార్యక్రమాలను నిర్వహించామన్నారు.సోమ, ఇంద్రుని ఆవాహనం చేసి అంకురహోమం, పాలికావాహనం చేసి మూలవిరాట్ కు రక్షాబంధనం చేసినట్లు ఆయన తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం విశ్వక్సేనునికి హారతి, మహాహారతులు అందజేశారు. స్వామి యాగశాల ప్రవేశానంతరం అగ్నిప్రతిష్ఠ, గరుడప్రతిష్ఠ కార్యక్రమాలు జరిపారు. వేడుకల్లో భాగంగా దిగువ అహోబిలంలో సెల్వర్ కుత్తు



ఎగువ అహోబిలం నుంచి విశ్వక్సేనుడి ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం

నిర్వహించారు.నిత్యం అభిషేకం నిర్వహించడం సాధ్యం కానందున బ్రహ్మోత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని సెల్వర్ కుత్తులో భాగంగా వెండితో తయారుచేసిన నిత్యోత్సవమూర్తి విగ్రహాన్ని పల్లకిలో కొలువుంచి ఆలయం చుట్టూఊరేగించి అష్టదిక్పాల కులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. అహోబిల దేవస్థానం ప్రధాన అర్చకుడు వేణుగోపాలన్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మఠం జనరల్ మేనేజర్ మురళీధరన్, జాబితా సలహా



మృత్తికాసూక్తం నిర్వహిస్తున్న అర్చకులు

సభ్యులు వైకుంఠం, మణియందర్/అడ్మినిస్ట్రేషన్ సుదర్శన్ లు పాల్గొన్నారు.

**అహోబిలంలోనేడు:**లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారంఎగువ అహోబిలంలో ఉదయం ధ్వజారోహణం, మధ్యాహ్నం అభిషేకం, సాయంత్రం బేరిపూజ, రాత్రి సింహవాహనం, దిగువ అహోబిలంలో సాయంత్రం అంకురార్పణం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మఠం, దేవస్థానం ప్రతినిధులు తెలిపారు. ఎగువ అహోబిలంలో పూర్ణకుంభంతో స్వామివారికి దేవస్థానం వారు స్వాగతం పలికి స్వామి వారికి పట్టు వస్త్రం పటారీ ఇచ్చారు. అహోబిలం 46వ పీఠాధిపతి స్వాములవారు



ప్రత్యేక అలంకరణలో విశ్వక్సేనుడు

స్వామివారిని దర్శించుకుని మంగళ శాసనం చేశారు. నూతన లడ్డు కౌంటర్ ను అహోబిల పీఠాధిపతి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ విద్యుత్ డీఇఇ రవికాంత్ చౌదరి పాల్గొన్నారు.

# కక్ష సాధింపు రాజకీయాలు తగదు : మాజీ ఎమ్మెల్యే

■ పోసానిని స్టేషన్లను తిప్పడం సరికాదు...

■ వైసీపీ మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

**ఆదోని, మేజర్ న్యూస్ :** రాజకీయంలో కక్ష సాధింపు రాజకీయాలు చేయడం సరైన విధానం కాదని వైసీపీ మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్వగృహంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పోసాని కృష్ణమురళీపై నమోదైన 15 కేసుల్లోభాగంగా మూడవ కేసు విచారణకు ఆదోని పట్టణ మూడవ స్టేషన్‌కు తరలిస్తున్నట్లు సమాచారం మేరకు మద్దతు ప్రకటించామన్నారు. పోసాని అరెస్టు, స్టేషన్ల తరలింపు కేవలం కక్ష సాధింపు చర్యగా కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వం పరిపాలనను గమనిస్తూనే ఉన్నారన్నారు. పోసాని తప్పు చేసి ఉంటే రాష్ట్రంలో ఏదో ఒకచోట కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవచ్చుగాని, రాష్ట్రమంతాట తిప్పడమేమిటన్నారు. అసలే ఆయన గుండెపోటుతో బాధ పడుతుంటే కేసుల పేరుతో గుంటూరు, కడప, ఆదోని, తదితరప్రాంతాల్లో తిప్పడం సరైంది కాదన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడుప్రతిపక్ష నేతలు అచ్చెం నాయుడు, అయ్యన్న పాత్రుడు, తదితరులు కూడ ఇష్టానుసారంగా మాట్లాడిన సంగతిని గుర్తు చేశారు. లోకేష్ రెడ్ బుక్ ప్రతికార చర్యల్లోభాగంగా, ప్రతిపక్ష నేతలను ఇబ్బంది పెట్టే ప్రక్రియగా ప్రభుత్వం చేస్తుందన్నారు. ప్రజలు నమ్మి అధికారాన్ని ఇచ్చిన ప్రభుత్వాన్ని కూటమి ప్రభుత్వం అభివృద్ధివైపు అడుగులు వేయాలేతప్ప ఇలాంటి ప్రతికార చర్యలు, కక్ష్యసాధింపులాంటివి కొనసాగించడం సరైంది కాదన్నారు. అధికారంలో ఉండి పార్టీ బలోపేతం చేసుకుంటూ, ప్రజాపరిపాలన, అభివృద్ధి, సూపరిపాలన అందించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేయకపోతే ప్రజల ఆగ్రహానికి ఎవరైనా గురికాక తప్పదన్నారు. ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ ప్రభుత్వానికి కూడ ప్రజలు 40శాతం ఓట్లు వేశారంటే ప్రజలకు పార్టీపై నమ్మకం పోయినట్లు కాదన్నారు. మూడు పార్టీల కలయిక ప్రజల్లో అభివృద్ధి జరుగుతుందన్న అభిప్రాయంతోనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఇది మరచి అధికారాన్ని అడ్డు పెట్టుకొని ఆరాచకాలకు, కక్ష్యసాధింపుకు, బెధిరింపులకు పూనుకుంటే తగిన మూల్యం ప్రజలు చెల్లిస్తారన్నారు. రాష్ట్రంలో మిర్చి రైతులు తల్లడిల్లుతుంటే పట్టించుకోకుండా ప్రతిపక్ష పార్టీ నేతల పతనం పనుల్లో కూటమి ప్రభుత్వం ఉండడం దారుణమన్నారు. పోసాని అరెస్టుకు మద్దతుగా ఆదోని వైసీపీ నేతలు సంఘీభావం తెలిపేందుకు ఎల్లవేళలా సిద్దంగా ఉన్నామన్నారు. అర్ధరాత్రి పోసానిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన వైసీపీ బృందం వెళ్ళి పరామర్శించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రకాంత్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ నరసింహులు, దేవదాసు, దేవా, కౌన్సిలర్‌చలా పతి, నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పోసానిపై జనసేన నేత ఫిర్యాదు – అరెస్టుకుసిద్ధమైన పోలీసులు**

ఆదోని జనసేన నేత రేణువర్మ ఫిర్యాదు మేరకు మూడవ పట్టణ పోలీసులు సినీనటుడు, మాజీ వైఎస్సార్సిపి నాయకుడు పోసాని మురళీకృష్ణపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. 14.11.2024వ తేదిన అప్పటి జనసేన పార్టీ అధినేత, ప్రస్తుత డిప్యూటీ సీఎం కొణేదల పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ ఫిర్యాదులో పవన్ కళ్యాణ్‌తోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్‌లపై కూడ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు వైసీపీ నాయకులు వెల్లడించారు. ఇందులోభాగంగా, గుంటూరు సబ్ జైలులో ఉన్న పోసానిని పిటి వారెంట్‌తో ఆదోనికి తరలిస్తున్నట్లు వైసీపీ నేతల సమాచారం.

# 4వరోజు కొనసాగుతున్న మహిళా సాధికారత వారోత్సవాలు



విద్యార్థినీలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ :** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లాలోని పాఠశాలలు,కళాశాలలో 4వరోజు మహిళా సాధికారత వారోత్సవాలు కొనసాగాయని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం కర్నూలు,ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లలోని ఆయా పోలీస్‌స్టేషన్ల ఆద్వర్యంలో కళాశాలు,పాఠశాలల్లో విద్యార్థినీలకు వకృత్వము (ఉపన్యాసం) పోటీలు నిర్వహించగా విద్యార్థినీలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల సాధికారత హక్కులు,సమానత్వం, ప్రస్తుత సవాళ్లు, మహిళా భద్రత వంటి కీలక అంశాలపై అవగాహన పెంపొందించే విధంగా వకృత్వము పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోలీస్ శాఖ రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని మహిళలు, చిన్నారులకు అత్యవసర సమయంలో సహాయం కొరకు హెల్ప్‌లైన్ నెంబర్లు చైల్డ్ లైన్ 1098,ఉమెన్ హెల్ప్‌లైన్ 181,పోలీస్ హెల్ప్‌లైన్ 100/112 ,సైబర్ క్రైం హెల్ప్‌లైన్ 1930,పోలీస్ కంట్రోల్ రూం వాట్సప్ నెంబర్ 7777877722కు కాల్ చేసి సహాయం పొందాలన్నారు.

# వైసీపీ నుండి 20 కుటుంబాలు టీడీపీలో చేరిక

**ఆదోని, మేజర్ న్యూస్ :** ఆదోని నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు సమక్షంలో వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. ఆదోని నియోజకవర్గం కుప్పగల్ గ్రామం నుండి మంగళవారం ఉమాపతి నాయుడు సమక్షంలో కుప్పగల్ గ్రామం నుండి వైసీపీ నేతలు 20 కుటుంబాలు కరగేని తిమ్మప్ప, ఓబులేష్, వెంకటేష్ మల్లి, మునిస్వామి, తిమ్మప్ప, తిరుమల తదితరులు తెలుగుదేశం పార్టీలోచేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగన్న, కృష్ణారెడ్డి, అయ్యన్న, గనేకల్ విరుపాక్షి,తాయప్ప, రంగస్వామి పాల్గొన్నారు.



వైసీపీ నాయకులకు టీడీపీ కండువాలు వేస్తున్న టీడీపీ సీనియర్ నాయకులు

# శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో క్వీజ్ పోటీలు



**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి సంబందించి శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో మహిళా ఆధారిత ప్రశ్నలు అనే భావనతో కూడిన మ్యూజికల్ చైర్‌ను విజయవంతం నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, ప్రగతిరెడ్డిలు తెలిపారు. ఈపోటీలలో 100మంది సభ్యులు పాల్గొన్నారు. బాలికలు కూడా ప్రశ్నలకు అద్భుతంగా సమాధానం ఇచ్చారు. బాలికలు ముందుకు వచ్చి ఆర్మ్ రెజ్లింగ్‌లో పాల్గొన్నారు. వంటలు, ఫ్యాషన్ పోటీలు నిర్వహించారు. దీనిని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రబూవణి కుమారి, దివ్యలతలు విజయవంతంగా నిర్వహించారు.

# కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడ్డ కర్ణాటక మద్యంతో ఎక్సైజ్ పోలీసులు.

**ఆలూరు,మేజర్ న్యూస్ :** కర్ణాటక లోని మోకా నుండి అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని చిప్పగిరి మండలం సంగాల గ్రామంవద్ద దాడులు చేసి అక్రమ మద్యాన్ని తరలిస్తున్న ఒక వ్యక్తిని పట్టుకొని అతని వద్దనుండి 7 బాక్సుల టెట్రా ప్యాకెట్లను,పల్సర్ బైకు ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లలితాదేవి, ఎస్సై నవీన్ కుమార్ లు తెలిపారు. గత కొంత కాలంగా నవోదయం 2.0 లో భాగంగా నాటు సారా,కర్ణాటక అక్రమ మద్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఎవరైనా అక్రమ మద్యం తరలిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో సోమేష్,మాలవ్య,సూర్య ప్రకాష్,లక్ష్మమ్మ పాల్గొన్నారు.

# ప్రారంభమైన వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే

**కర్నూలు నగరం, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలు అనుసరించి పేదరికాన్ని నిర్మూలించడానికి ప్రతి సచివాలయం పరిధిలో వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే ప్రారంభమైందని దీనికి నగర ప్రజలు సహకరించాలని నగరపాలక సంస్థ కమీషనర్ రవీంద్రబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో 2,73,576మంది వర్క్ ఫ్రమ్ హోమ్ చేయుచున్నారని తెలిసిందని కావున వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేకు వచ్చే సచివాలయ ఉద్యోగులకు సహకరించాలని కోరారు. ఈ సర్వేకు 18–50సం॥ల వయో పరిమితి ఉండి నిరుద్యోగులుగా ఉన్న వారు అర్హులని, ఐటి సెక్టార్ నందు అన్ని సౌకర్యాలు ఉన్నాయా..లేదా..తెలుసుకొని వారికి అన్ని ఐటి సెక్టార్ సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. మార్చి 10వ తేదీ వరకు సర్వే జరుగునని కావున ప్రతి ఒక్కరు వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేకు సహకరించాలన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల తీర్పు కూటమి పరిపాలనకు నిదర్శనం



మాట్లాడుతున్న హనుమంతరావు చౌదరి,లక్ష్మీ పద్మా చౌదరిలు

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** ఎమ్మెల్సీ ఎన్నికలలో ఘన విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్,ఉమ్మడి కృష్ణా,గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన ఆలపాటి రాజా,ఉమ్మడి గోదావరి జిల్లాల తెదేపా అభ్యర్థి పేరా బత్తుల రాజశేఖర్ ఎమ్మెల్సీ లుగా గెలుపొందడంతో వారందరికి తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు హనుమంతరావు చౌదరి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024ఎన్నికల్లో ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇచ్చి అఖండ మెజార్టీతో గెలిపించారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 9నెలల కాలంలో ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తుండడంతో ఆయన పరిపాలనకు మెచ్చి పట్టభద్రులు ఇచ్చిన తీర్పు ఇది అన్నారు. రాబోవు రోజుల్లో ప్రభుత్వానికి ప్రజలు మద్దతు తెలపాలని ఎన్నికల్లో ప్రకటించిన పథకాలను ప్రజలకు అందిస్తారని హనుమంతరావు చౌదరి,ఆర్గనైజర్ సెక్రటరీ లక్ష్మీ పద్మా చౌదరిలు తెలిపారు.

# పెరిగిన ధరలకు అనుకూలంగా ఆశా కార్యకర్తలకు వేతనం మంజూరు చేయాలి



**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** పెరిగిన ధరలకు అనుకూలంగా ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని సిపిఎం మండల నాయకులు ఎం. కర్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పారుమంచాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారి యశశ్వినికి, జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారిణి షాబాలకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్త హక్కుల పరిష్కారం కొరకు ఈనెల 6వ తేదీన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని ప్రతి ఆశా కార్యకర్త ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన అన్నారు. ఆశా కార్యకర్తలు ఐక్య పోరాటానికి సిద్ధమయితేనే ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున ఛలో విజయవాడకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఉన్నత న్యాయ స్థానాలు చెప్పినప్పటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయడం లేదని ఆయన మండిపడ్డారు. ఎఎన్ఎం శిక్షణ పొందిన వారికి పర్మినెంట్ పోస్టు ఇచ్చి దశల వారిగా ఆశా వర్కర్లకు ఎఎన్ఎం శిక్షణ ఇవ్వాలని కోరారు. ప్రతి కార్యకర్త ఛలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాంబాబు, ఆశా కార్యకర్తలు భారతి, లక్ష్మీదేవి, రాణెమ్మ, జయమ్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మీ అందరి కృషి ఫలితమే క్లస్టర్ యూనివర్సిటీ అభివృద్ధి

## – వీసీ ఆచార్య డీవిఆర్ సాయి గోపాల్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్ న్యూస్ :** మీ అందరి కృషి ఫలితమే క్లస్టర్ యూనివర్సిటీ అభివృద్ధి అని వీసీ ఆచార్య డివిఆర్ సాయి గోపాల్‌లు పేర్కొన్నారు. మంగళవారం వీసి వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య డివిఆర్ సాయిగోపాల్ మాట్లాడుతూ క్లస్టర్ యూనివర్సిటీ అభివృద్ధిలో మొదటి యూనివర్సిటీగా నేను భాగస్వామి కావడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తానని ఈ యూనివర్సిటీ రాష్ట్రంలోనే కాక దేశంలోనే ఒక ప్రముఖ విశ్వ విద్యాలయంగా భవిష్యత్తులో వెలుగొందుతుందని ఇక్కడ చదివిన ప్రతి ఒక్కరికి మంచి అవకాశాలు ఉంటాయని అన్నారు. అనంతరం వీసీ నాలో నేను అనే తన ఆత్మకథ పుస్తకాన్ని సభలో ఆవిష్కరించారు. సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల




మాట్లాడుతున్న వీసీ ఆచార్య డివిఆర్ సాయి

ప్రిన్సిపల్ డాక్టర్ వివిఎస్ కుమార్ మాట్లాడుతూ క్లస్టర్ యూనివర్సిటీకి మొదటి వీసీ పరిపాలనపై మంచి అవగాహన ఉన్న వ్యక్తి వీసీగా రావడం వలన క్లస్టర్ యూనివర్సిటీ ఇంత అభివృద్ధి చెందిందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్లస్టర్ యూనివర్సిటీ దిన దిన అభివృద్ధి చెందుతుండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మాజీ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసులు మాట్లాడుతూ అందరి సహకారంతో క్లస్టర్ యూనివర్సిటీని తమవంతు అభివృద్ధి చేశామన్నారు. రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి విజయ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ క్లస్టర్ యూనివర్సిటీ ఒక మంచి విద్యాలయంగా భవిష్యత్తు లో వెలుగొందుతుందన్నారు. తదనంతరం వీసీ ఆచార్య డివిఆర్ సాయిగోపాల్ ఆయన సతీమణి వాసంతిలను క్లస్టర్ యూనివర్సిటీ అధ్యాపకులు, రిజిస్ట్రార్‌లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి,చంద్రశేఖర్, క్లస్టర్ యూనివర్సిటీ డిగ్రీ కాలేజీల వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ బిఆర్ ప్రసాద్‌రెడ్డి,డాక్టర్ హేమంత్ కుమార్,డాక్టర్ దేవికారాణి,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# నేటి నుంచి గంజహళ్లి బడేసాహెబ్ ఉరుసు మహోత్సవం

- 331వ ఉరుసు మహోత్సవం
- 2.50 లక్షల భక్తులు పాల్గొనున్నట్లు అంచనా..
- ప్రత్యేక బస్సులు, ముగ్గురు ఎస్ఐలు, 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గోనెగండ్ల మండల పరధిలోని గంజహళ్లి గ్రామంలో వెలసిన భక్తుల పాలిట కొంగు బంగారమైన మహత్మ బడేసాబ్ 331 ఉరుసు మహోత్సవం ఈనెల 5 నుంచి 7వ తేది వరకు జరుగుతున్నట్లు దర్గా పీఠాధిపతులు తెలిపారు.ప్రతి సంవత్సరం స్వామి వారి ఉరుసు కులమతాలకు అతీతంగా జరుగుతుంది. దర్గా దర్మకర్తలు హిందువులు కావడం విశేషం. ఈ సందర్భం గా దర్గా పీఠాధిపతి మాట్లాడుతూ స్వామివారు జీవ సమాది అయి ఇప్పటికి 331 ఎళు అయిందని స్వామి వారి మహిమలు గురించి వివరించారు.మార్చి 5న శ్రీవారి గంధం, 6వ తేది శ్రీవారి ఉరుసు, 7వ తేది స్వామివారి జియారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉరుసు సందర్భంగా భక్తులకు భోజన సౌకర్యం ఏర్పా టు చేసినట్లు తెలిపారు. 6వ తేదీ జరిగే ఉరుసు మహోత్సవంలో మన రాష్ట్రంలో నుంచే కాక కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి దాదాపు 2 లక్షల నుంచి 2.50లక్షల మంది భక్తులు పాల్గొంటారని వారి అందరికి సౌకర్యాలు అందిం చేందుకు తమ



స్వామివారి దర్గా



స్వామివారి ఉహాచిత్రం

వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతి నిధులు ఉరుసుకు హాజరవుతున్నట్లు తెలి పారు. ఆర్టీసీ అధికారు లు ఎమ్మిగనూరు, ఆదో ని, పత్తికొండ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే గోనెగండ్ల నుంచి భక్తులు గంజహళ్లి కి వెళ్లేందుకు ఆటోలు కూడా ఉంటాయని తెలిపారు. భక్తులకు తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు గాను గ్రామ పంచాయతీ సిబ్బంది. ఆర్డబ్ల్యుఎస్ అధికారుల ఆధ్వర్యంలో 20 ట్యాంకర్లతో నీటిని నిరంతరం సరఫరా చేయనున్నట్లు తెలుస్తుంది. అలాగే పలు రాజకీయ పార్టీల నాయకులు కూడా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. ఉరుసు మహోత్సవంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గాను పోలీసు అధికారులు ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. సీఐ, ముగ్గురు ఎస్లు, 160 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

**భక్తులకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటాము: దర్గా కమిటీ :** స్వామివారి ఉరుసులో పాల్గొనున్న లక్షల మంది భక్తులకు ఎలాంటి అసోకర్యాలు కల్గకుండా చూసుకుంటామని దర్గా కమిటీ వారు వెల్లడించారు.దర్గా ఉరుసు మహోత్సవాలకు విచ్చేస్తున్న బక్తుల కోసం చలువ పందిళ్లు, విశ్రాంతి వసతి, తాగునీరు, ఉచిత భోజనం ఏర్పాటు చేస్తున్నామని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాటు చేశామన్నారు.

# రీ సర్వే పనులను గడువులోగా పూర్తి చేయాలి



సర్వే పనులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రతిరోజు 25 ఎకరాలకు మించకుండా రీ సర్వే పనులు జరిగేలా రెవెన్యూ, సర్వే శాఖల అధి కారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఆదేశించారు. మంగళవారం పాణ్యం మండలం, గగ్గటూరు గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనుల గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రి యను జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల్లో జరుగుతున్న రీ సర్వే పనులు గడువులోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు 25 ఎకరాలకు మించకుండా రీ సర్వే పనులు చేయాలన్నారు. మార్పులు లేకుండా రికార్డుల్లో ఉన్న మేరకు సర్వే పనులు చేపట్టాలన్నారు. గ్రామ సరిహద్దు స్థిరీకరణ, స్టోన్ ప్లాంటేషన్ తదితర పనులు కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ కరెక్షన్స్, మ్యుటేషన్ ట్రాన్సక్షన్ డేటా ఎంట్రీ కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పాణ్యం మండలం గగ్గటూరు గ్రామంలో డ్రాగన్ ఫ్రూట్స్ సాగుచేస్తున్న రైతు మిద్దె హుసేన్ పొలాన్ని పరిశీలించారు.

# ప్రభుత్వం హయామంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం



కడ్లేమాగి రస్తాకు భూమి పూజను చేస్తున్న నాయకులు

**హొళగుంద,మేజర్‌న్యూస్‌:** కూటమి ప్రభుత్వం హయామంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవు తుందని టీడీపీ ఆలూరు తాలూక ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ అన్నారు.మంగళవారం కడ్లేమాగి రస్తాకు ఎన్ఆర్‌జిఎస్ గ్రాంట్ కింద రూ.3 కోట్ల 60 లక్షల నిధులను మంజూరు చెయించి భూమి పూజను చేశారు.మట్టి రోడ్డును బిటి రోడ్డు నిరాణానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా వీరభద్రగౌడ విలేకర్లుతో మాట్లాడారు.ప్రభుత్వ హయామంలో అధ్వాన్నంగా ఉన్న రోడ్లకు మహదర్శ కల్పిస్తున్నట్లు చెప్పారు.అభివృద్ది ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటి ఛైర్మన్ మిక్కిలినేని వెంటక శివప్రసాద్,శ్రీనివాసరావు,పంపనగౌడ,విజయ్ ,చిదానంద, ప్రసాద్,కాంట్రాక్టర్ రఘుప్రసాద్‌రెడ్డి నాయకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

# గురుకుల పాఠశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

**ఓర్వకల్లు, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కాల్వబుగ్గ ఏపి గురుకుల పాఠశాల బాలురు 2025-26విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రసాదరావు మంగళవారం తెలిపారు. 2025-26విద్యా సంవత్సరానికి 5వ తరగతికి 80సీట్లు, 6,7,8వ తరగతులకు మిగిలిన ఖాళీలకు సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోపు ఏపి గురుకుల వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపించాలన్నారు. ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష ఉంటుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ఆసుపత్రి సిబ్బంది ఎఫ్ఆర్ఎస్,అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలి

## – సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు



**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ :** ఆసుపత్రి సిబ్బంది ప్రతి ఒక్కరు ఎఫ్ఆర్ఎస్ మరియు అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ప్రభుత్వ వైద్యశాల ధనవంత్రి హాల్‌లో మినిస్ట్రియల్ స్టాఫ్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి సిబ్బంది ప్రతిఒక్కరు సమయపాలన పాటించి వారికి నిర్ణయించిన సమయంలో వారు అందుబాటులో ఉండాలన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలు మరియు ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే నిర్లక్ష్యం చేయకుండ వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కోర్టు కేసులు,బడ్జెట్ ఫైల్స్, అత్యవసర మందులకు సంబంధించిన ఫైల్‌లను త్వరగా పూర్తి అయ్యేటట్లు చూసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఆసుపత్రి సిబ్బందికి ఇచ్చిన సబ్జెక్టు ఫైళ్లపై పనితీరు మెరుగు పరుచుకొని ఆయా శాఖలకు సంబంధించిన పర్ఫామెన్స్ పెంచు కోవాలన్నారు. సిబ్బంది పనితీరు మెరుగుపరచకపోతే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా. శ్రీరాములు,అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రమణ్యం,ఆసుపత్రి ఏడి మల్లేశ్వరమ్మ, ఏఓ శ్రీనివాసులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూసార పరీక్షలు చేయించుకోండి

## – అధిక దిగుబడి పొందండి




**మహానంది, మేజర్‌న్యూస్ :** ప్రతి రైతు తమ పొలంలో పంట వేసే ముందు భూసార పరీక్షలు చేయించుకొని సారవంతమైన పంటలు వేసుకోవడం వలన అధిక దిగుబడి పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సీతారామాపురం, నందిపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు పొలాలను పరిశీలించి సూచలనలు, సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు మార్చి 6వ తేదీ లోపల రబీ పంటకు సంబంధించి నమోదు చేసుకున్న ప్రతి రైతు ఇ-కేవైసీ చేయించుకోవాలని అన్నారు. రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకొని 11 నంబర్లతో కూడిన విశిష్ట సంఖ్యను పొందాలని అన్నారు. విశిష్ట సంఖ్య కలిగిన రైతుకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. రైతులు ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని అన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని అన్నారు. భూసార పరీక్షలు చేసుకోవడానికి ఏప్రిల్, మే నెలల్లో అనుకూలమైనదని, రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరెడ్డి, వీఏఏ లక్ష్మికాంత్ పాల్గొన్నారు.

# నేడు మండల సర్వసభ్య సమావేశం



ఎంపిడిఓ విశ్వమోహన్

**తుగ్గలి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన తుగ్గలిలోని మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం ఎంపిపి అద్దంకి ఎర్ర నాగప్ప అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ విశ్వమోహన్ తెలిపారు. ఈ సమావేశంలో ప్రస్తుతం వేసవి ఉండడంతో నీటి ఎద్దడిపై సమావేశంలో చర్చించడం జరుగుతుం దన్నారు. అలాగే అజెండాలో ఉన్న అన్ని అంశాలను చర్చించడంతో పాటు ఎంపిపి అనుమతితో ఇంకా ఏమైనా ముఖ్యమైన విషయాలు ఉంటే సభలో చర్చించడం జరుగుతుందన్నారు. కావున మండలంలోని ప్రభుత్వ అధికారులు తమ శాఖలకు సంబంధించిన సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆయన తెలిపారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకునేందుకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని ఆయన తెలిపారు. ఎంపిటిసిలు,సర్పంచ్‌లు,ప్రజా ప్రతినిధులు ఈ సమావేవానికి హాజరు కావాలని ఆయన కోరారు.

## జనన,మరణ ధృవీకరణ పత్రాల జారీలో..

# జాప్యాన్ని నివారించండి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా నిర్ణీత కాల వ్యవధిలోగా అందజేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి వైద్యా. దికారులు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జనన మరణ పత్రాల జారీపై ఇంటర్ డిపార్ట్‌మెంట్ కమిటీ సమావేశాన్ని సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. డిఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డిసిహెచ్‌ఎస్ జఫరుల్లా, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ జిలాని, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, డిపిఓ జమీవుల్లా, స్టాటిస్టికల్ అధికారి సుజాత అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీలో జాప్యాన్ని నివారించి నిర్ణీత కాల వ్యవధిలోగా అందజేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బిడ్డ పుట్టిన తరువాత 21రోజుల వ్యవధిలోపు డెలివరీ అయిన ఆసుపత్రిలోనే మెడికల్ ఆఫీసర్ నుంచి పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రవేట్ ఆసుపత్రులలో డెలివరీ అయిన కేసులు గ్యాప్ లేకుండా నిర్ణీత సమయంలోగా అప్‌లోడ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జనన, మరణ రికార్డులు సంబంధిత కార్యాలయాల్లో ఉండడంతో పాటు సచివాలయాల్లో కూడా అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జనన మరణ ధృవీకరణ పత్రాల జారీపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

---

- ఆందోళనలో అన్నదాత
- ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరుతున్న రైతులు

### ఆగిన కెసికాలువ

# నీటి సరఫరా



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ నియోజకవర్గానికి కేసి. తెలుగుగంగలు ప్రధాన సాగునీటి వనరులు. వీటిని నమ్ముకుని లక్షలాది ఎకరాల్లో కోట్లాదిరూపాయల పెట్టుబడితో రైతులు ప్రతి ఏటా పంటలు సాగుచేస్తున్నారు. కెసికాలువ క్రింద ప్రధానంగా వరిని సాగుచేస్తున్నారు. వారం రోజులుగా కెసికాలువకు నీటిసరఫరా లేక అన్నదాత ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండ సాగునీరు అందుతుందన్న నమ్మకంతో రైతులు వరి సాగుచేశారు. సాగునీరు రాకపోవడంతో పెట్టిన పెట్టుబడులను కోల్పోయి భిక్షాటన చేయవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కెసికాలువ క్రిందసాగుచేసిన వరిపంట ప్రస్తుతం వెన్నదశలో ఉంది. నీరు రాకపోతే రైతుల పరిస్థితి ఆగమ్యగోచరమే. కెసికెనాల్ పరిధిలోని గోవిందపల్లె, కామినేనిపల్లె. శిరువెళ్ల, కోటపాడు, వీరారెడ్డిపల్లె, వెంకటాపురం జూలేపల్లె, తదితర గ్రామాల పరిధిలో వరిసాగు చేసిన రైతులు నీటిసరఫరా ఆగిపోవడంతో ఆందోళన చెందు తున్నారు. ప్రజాప్రతినిధులు చొరవ చూపి పంటను దక్కించుకునేందుకు సాగునీరు అందించాలని కెసికాలువ ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ముందస్తు సమాచారం లేకుండ జలవనరులశాఖ అధికారులు నీటిసరఫరా నిలిపివేయడంతో రైతు లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కెసికాలువ పరిధిలో ప్రస్తుత రబీసీజన్లో వరి, మిరప, తదితర పంటలు సాగుచేసిన రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. కెసికాలువ పరిధిలో 25వేల ఎకరాల్లో సాగుచేసిన రైతుల పరిస్థితి ఇబ్బం దికరంగా మారిందని కామినేనిపల్లె మాజీ సర్పంచ్ కమ్మసుబ్బరాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. వరిపంట పొట్టద శలో ఉన్న సమయంలో నీటి సరఫరా నిలిపివేస్తే పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, బవకచర్ల హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటి సరఫరాను నిలిపివేశారన్నారు. కెసికాలువకు కనీసం 25 రోజుల పాటు నీటిసరఫరా జరిగేలా జలవనరులశాఖకు మంత్రులు ఆదేశాలు జారీచేయాలని కమ్మసుబ్బరాయుడు కోరుతున్నారు.

---

## రాఘవేంద్ర స్వామి మఠంలో ఘనంగా సామూహిక భజన

- శ్రీ మఠంలో విశేష పూజలు
- కొనసాగుతున్న గురు వైభోత్సవాలు
- ప్రముఖులకు పీఠాధిపతి అవార్డుల ప్రధానోత్సవం



అవార్డులు అందుకున్న ప్రముఖులు



**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో మఠం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో జరుగుతున్న గురువైభోత్సవాల్లో భాగంగా, నాల్గవ రోజు మంత్రాలయం మఠంలో శ్రీ గరు సార్వభౌమ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఘనంగా సామూహిక భజన నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న భజన మండలికి చెందిన దాదాపు 2వేల మంది సభ్యులు భక్తిశ్రద్ధలతో మఠంలో పాల్గొన్నారు. ముందుగా శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి సుప్రభాతం, నిర్మల్య విసర్జన, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు స్వామివారికి నిర్వహించి మహామంగళహారతులు ఇచ్చారు. అనంతరం శ్రీ గురుసార్వభౌమ, సాంస్కృతిక విద్యాపీఠంలో న్యాయ సుధ గ్రంథంలో స్వామిజీ న్యాయసుధ పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వ్యాసరాజ్య మఠం హెచ్‌హెచ్ విద్యాపీఠం విజయ తీర్థులు ఉన్నారు. గురు వైభోత్సవాల్లోభాగంగా, బళ్ళారికి చెందిన పార్లమెంట్ సభ్యుడు తుకారం, బె ంగుళూరులోని పూర్ణ ప్రజ్ఞ విద్యా పీఠానికి చెందిన విధ్వాన్ కేశవ చార్యులు వారు చేసిన కృషికి గుర్తింపుగా శ్రీ రాఘవేంద్రస్వామి ప్రశస్థ అవార్డులతో సత్కరించారు. వారు ముందుగా గ్రామదేవత మంచాలమ్మను, శ్రీ రాఘవేంద్రస్వామి బృందావనాన్ని దర్శించకొని పూజలు చేశారు. వారికి మఠం పీఠాదిపతి శేషవస్త్రం కప్పి ఫలమంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పండిత కేసరి రాజాఎస్ గిరిజాచార్, ఆనందతీర్థ ఆచార్, ఎఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేష్ జోషి, ఐపి నరసింహా మూర్తి, మాజీ మేనేజర్ ఎస్.కె. శ్రీనివాస్ రావు, వ్యాసరాజాచార్, అనంత ఆచార్, రాణికులకర్ణి, తదితరులు పాల్గొన్నారు.

---

# భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారిద్దాం

- లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలను ఉపేక్షించొద్దు
- పీసీపీ ఎన్డీటీ చట్టంపై అవగాహన కార్యక్రమాలు
- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రూ.50వేలు జరిమాన, జైలుశిక్ష
- సబ్ కలెక్టర్, డీఎస్పీ




సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

**ఆదోని, మేజర్ న్యూస్ :** సమాజంలో లింగ అసమానతలకు కారణమవుతున్న భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారించేందుకు కృషి చేయాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పిలుపునిచ్చారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ, పిసి పిఎన్డీటి చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని సబ్ కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో భృణ హత్యలు నివారించడం పిసి పిఎన్డీటి చట్టంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం డివిజన్‌లోని స్కానింగ్ నిర్వాహకులు ప్రైవేట్, ప్రభుత్వ వైద్య అధికారులకు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పులు తీసుకురావడం ద్వారానే భ్రూణ హత్యలను నివారించగలమన్నారు. రానున్న రోజుల్లో గర్భస్థ శిశువులపై లింగ వివక్షకు వ్యతిరేకంగా పిసిపిఎన్డీటి చట్టంపై అవగాహన కలిగించాలన్నారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. నిబంధనలు ఉల్లంగించిన వారిపై రూ.50వేలు జరిమానా, 3 సంవత్సరాల వరకు జైలుశిక్ష పడుతుందన్నారు. పిసిపిఎన్డీటి చట్టం ప్రకారం స్కానింగ్ కేంద్రాలపై ఖచ్చితమైన సమాచారం అందించిన వారికి రూ.25వేలు నుండి లక్ష వరకు బహుమతి అందించే అవకాశం ఉందన్నారు. ఆదోని డివిజన్ పరిధిలో 48 స్కానింగ్ కేంద్రాలు ఉండగా, డివిజన్లో ఉన్న స్కానింగ్ కేంద్రాన్ని ప్రతి 3నెలలకు ఒకసారి తనిఖీ చేసి నూతన రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్, సిబ్బంది,చిరుమానా, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్కానింగ్ సెంటర్లను అనుమతులు రద్దు చేయాలన్నారు. అనంతరం డిఎస్పీ భ్రూణహత్య అనేది సమాజానికి కలిగే తీవ్ర అనర్థం మాత్రమే కాకుండా చట్టపరంగా కూడ నేరం. గర్భంలో ఉండగానే లింగ నిర్ధారణ చేసి ఆడ శిశువులను నిర్ధాక్షిణ్యంగా హత్య చేయడం మన సమాజం ఎదుట ఉన్న సవాలుగా మారింది. ఆడపిల్లల తల్లిదండ్రులకు చదువు విలువలను తెలియజేయాలన్నారు. అనంతరం డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి మాట్లాడుతూ, లింగ నిర్ధారణ చేయకుండా ఉండడం, వైద్యులు ఎవరూ గర్భంలోని శిశువు లింగాన్ని నిర్ధారించరాదన్నారు. నైతిక వైద్య సేవలు అందించడం – పేదరికం, కుటుంబ ఒత్తిళ్ల వలన భ్రూణ హత్యకు ఒత్తిడి ఎదుర్కొనే తల్లులకు మానసిక, వైద్య పరమైన సలహా అందించాలన్నారు. ఈ సమావేశంలో డిఎస్పీ హేమలత, డిప్యూటీడిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ నాగప్రసాద్, డెమో అధికారి శ్రీనివాసులు, డిప్యూటీ డెమో అధికారి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా మానటరింగ్ కన్సల్టెంట్ అధికారి సుమలత, సీడీపీఓ సఫర్‌నిసా బేగం, ఉమ మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

---

## 167కె జాతీయ రహదారి భూసేకరణలో అధికారుల లీలలు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా కొత్తపల్లె మండలం గుమ్మడాపురం మజరా శింగరాజుపల్లె గ్రామానికి చెందిన మూగి వెంకటరమణారెడ్డి అనే రైతుకు సంబంధించిన సర్వే నెంబర్ 331 తరిభూమి మాగాని 0.13సెంట్లు కల్వకుర్తి-నంద్యాల 167కె జాతీయ రహదారిలో భూమి పోయిందని రమణారెడ్డి తెలిపారు. ప్రభుత్వం రూ.47,756 పరిహారం చెల్లించేందుకు అవార్డు నోటీసు కూడా రైతుకు అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం గతనెల జనవరి 31వ తేదీ నుంచి మొదటి విడతగా రైతులకు భూమి నష్టపరిహారం వారి బ్యాంకు ఖాతాలోనే జమ చేస్తుంది. రైతు రమణారెడ్డి నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లోని భూసేకరణ కార్యాలయంకు వెళ్లి నా పొలం డబ్బులు రాలేదని సంబంధించిన అధికారులను కోరగా రెండో విడత నీకు నీ పొలం డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు. అయితే మంగళవారం శింగరాజుపల్లె గ్రామానికే చెందిన మారేడు ప్రమీలమ్మ బ్యాంకు అకౌంట్‌లో జమ చేయడంతో ఒక్కసారిగా ఖంగుతిన్నారు. ఆమె నిజాయితీగా మీ డబ్బులు మాకేందుకు మేము బ్యాంకు నుంచి తీసుకుని వచ్చామని చెప్పడంతో గ్రామస్తులు, రైతు ఒక్కసారిగా అవాక్కయ్యారు. రెడ్డిగారి పొలం డబ్బులు దళిత మహిళా అకౌంట్‌కు వేయడం ఏమిటీ ఆయన పొలం పక్కన కూడా ప్రమీలమ్మ పొలం లేదే సంబంధం లేని వారికి భూమి పరిహారం డబ్బులు ఎలా బ్యాంకు అకౌంట్‌లలో జమ చేస్తారని రైతు రమణారెడ్డి పేర్కొన్నారు. వారు బ్యాంకు నుంచి విడుదల చేసుకుని బాధిత రైతుకు నేరుగా ఎలా ఇస్తారని ప్రశ్నలు గుప్పించారు. ఇలా ఇంకెంత మంది రైతుల పరిహారం డబ్బులు చేతులు మార్చారో 167కె భూసేకరణ అధికారులకే తెలియాలి, జిల్లా కలెక్టర్ వెంటనే తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకుని మళ్లీ ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని బాధిత రైతు కోరుతున్నారు.



సూర్య
బుధవారం | 05 మార్చి 2025

# ఆగవెలిలో శ్రీ పెద్దమ్మ దేవర ఉత్సవాలు ప్రారంభం




**కృష్ణగిరి,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని ఆగవెలి గ్రామంలో శ్రీ పెద్దమ్మ దేవర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. అలాగే శ్రీ సుంకులమ్మ,శ్రీ కర్రెమ్మ,శ్రీ మారెమ్మ,శ్రీ రాములమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు నైవేద్యాలల కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం శ్రీ అమ్మవార్లకు బోనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామస్తులు తెలిపారు.

# తాత్కాలికంగా విద్యుత్ పని వేళల్లో మార్పు

**కృష్ణగిరి,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని చిట్యాల విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆర్‌డిఎస్ఎస్ పనులు చేస్తున్నందున పని వేళలు మార్పు చేసినట్లు ఏఈ మద్దిలేటి తెలిపారు. పెద్దొడ్డి,చిట్యాల ఫిడర్‌కు ఈ నెల 5 నుండి 20 వరకు ఉదయం 5 నుండి మద్యాహ్నం 2గంటల వరకు త్రీఫెస్ విద్యుత్‌ను ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలతో పాటు రైతులు విద్యుత్ సిబ్బందితో సహకరించాల్సిందిగా ఏఈ పెర్కొన్నారు.

# కొత్తకోట దేవరలో కోట్ల సుజాతమ్మ



**డోన్ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో జరుగుతున్న గ్రామ దేవరకు డోను మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హాజరయ్యారు. మంగళవారం గ్రామానికి విచ్చేసిన కోట్ల సుజాతమ్మకు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు .అనంతరం గ్రామంలో అమ్మవారికి కోట్ల సుజాతమ్మప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, టిడిపి నాయకులు ఓబులా పురం శేసిరెడ్డి, ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి వేడుకలలో డీజేలు ఏర్పాటు చేస్తే కఠినచర్యలు - సీఐ



**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** పెళ్లి వేడుకలు, ఊరేగింపులలో డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గోనెగండ్ల సీఐ గంగాధర్ హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ డీజే ఏర్పాట్లకు ఎట్టి పరస్థిత లలో అనుమతి ఇవ్వమని తెలిపారు. అధికశబ్దం వచ్చే మైక్, డెక్కులకు డీఎస్పీ ద్వార అనుమతి తీసుకోవాలని ఆ శబ్దం కూడా 70 డెసిబుల్స్ వరకు మాత్రమే ఉండాలని ఆది కూడా రాత్రి 10 గంటల వరకు మాత్రమే అనుమతి అని పెర్కొన్నారు. అధిక శబ్దాల వల్ల గుండెపోటు, బ్రెయిన్, స్ట్రోక్, వినికిడ సమస్య, చెవిలో శబ్దదాలు రావడం, కర్ణబేరి దెబ్బతినడం, అధికరక్తపోటు రావడం, నిద్రలేవి. మానసిక ఆందోళన, గుండెదడ, వంటి సమస్యలు తలెత్తుతాయని ఆయన అన్నారు. కావున డీజే పెట్ట కూడదు అని అందరికి అవగాహన రావాలని కోరారు. పోలీసుల అనుమతి లేకుండా డీజే లు ఏర్పాటు చేస్తే వారి పై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ప్రత్యేక అధికారి

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె పట్టణంలో కంకర గుర్రెడ్డి జూనియర్ కళాశాలను మంగళవారంనాడు ప్రత్యేక అధికారి ఈ.వి సుబ్బారెడ్డి పరిశీలించారు. కంకర గుర్రెడ్డి జూనియర్ కాలేజ్ సెన్సిటివ్ కళాశాలగా ఉండటంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా పరిశీలించడం జరిగిందని పరీక్షలు పూర్తి అయ్యేంత వరకు పరిశీలకుడిగా ఎంపిడిఒ, తహశీల్దార్ , మండల విద్యాశాఖ అధికారి అలాంటి వారు పరిశీలించడం జరుగుతుందని వారు తెలిపారు.


ఉపాధ్యాయులకు సూచనలు అందజేస్తున్న సుబ్బారెడ్డి

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం


డ్రైనేజి పనులు చేపడుతున్న పంచాయితీ కార్యదర్శి

**కోసిగి మేజర్ న్యూస్:**
కోసిగి గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రజలు సహకరించాలని సర్పంచ్ అయ్యమ్మ, పంచాయితీ కార్యదర్శి తిరుమలేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోసిగిలోని వివిధ కాలనీల్లో పారుశుద్ధ్య పనులు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా కోసిగిలో అన్ని కాలన్నీల్లో పారుశుద్ధ్యపనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కోసిగి శివారుల్లోని డ్రైనేజిలో పేరుకుపోయిన చెత్తాచెదారంను, పూడికను తొలగించామన్నారు. అలాగే మురుగునీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం వేయకుండా ఉండాలని వారు ప్రజలకు సూచించారు. వాటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని అంటురోగాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాణిక్యరాజు, యువనాయకులు రాజేష్, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ/వార్డు సచివాలయ హెల్త్ కార్యదర్శులకు తక్షణమే ప్రమోషన్ కల్పించాలి

**ః- రాష్ట్ర అధ్యక్షులు బత్తుల కోదండ రామిరెడ్డి**



**తుగ్గలి, మేజర్ న్యూస్ ః** రాష్ట్రంలో గ్రామ/వార్డు సచివాలయ హెల్త్ కార్యదర్శులకు తక్షణమే ఏఎన్ ఎంలుగా ప్రమోషన్లు కల్పించాలని ఏపి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల కోదండ రామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టులకు గ్రామ/వార్డు సచివాలయ హెల్త్ కార్యదర్శులకు ఏఎన్ఎంలుగా ప్రమోషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ/వార్డు హెల్త్ సచివాలయం కార్యదర్శులకు ప్రమోషన్లు ఇవ్వాలని ప్రభుత్వం 179జీఓ జారీ చేసిందన్నారు. ఆ ప్రకారం అసోసియేషన్ రాష్ట్ర శాఖ గతంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. దీంతో జీఓ నెంబర్ 179 ప్రకారం తక్షణమే ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టులను సచివాలయ హెల్త్ కార్యదర్శులకు ప్రమోషన్లు ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఉత్తర్వులు ఇచ్చి 6నెలలు గడుస్తున్నా ప్రమోషన్లు ఇవ్వకుండ కాలయాపన చేయడం సరికాదన్నారు. ఈ విషయమై తాము గత వారం రోజుల క్రితం అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి వచ్చిన అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కెవిఎన్ఎస్ అనిల్ కుమార్‌ను కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. అయినప్పటికీ నేటి వరకు ప్రమోషన్లు ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు మరోసారి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఇప్పటికైనా ప్రమోషన్ ఇవ్వాలని ఆయన కోరారు.

# రెవెన్యూ అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

(మొదటిపేజి తరువాయి..)


తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులను కలెక్టర్ తనిఖీ చేస్తున్న దృశ్యం

మాత్రం సర్వేకి సంబంధించిన అర్జీల పరిష్కారం గడువు దాటడంతో కలెక్టర్ సర్వేయర్ పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్వేయర్ కు షోకాజ్ నోటీసులు జారీ చేసి, సంజాయిషీ అడగాలని కలెక్టర్ కర్నూలు ఆర్‌డిఓను ఆదేశించారు. భూరీ సర్వే గ్రామసభలు, రెవెన్యూ సదస్సులకి సంబంధించిన వివరాలు గ్రామాల వారీగా సరిగ్గా లేకపోవడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నివేదికలను సక్రమంగా రూపొందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెవెన్యూ సర్వీస్ లకి సంబంధించి ఇంటిగ్రేటెడ్ సర్వీస్ లకు సంబంధించిన దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏ లో 85 గడువు దాటి ఉన్నాయని, ఈ అంశం పై సమీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ భాష కర్నూలు ఆర్డీఓ ను, ఫోన్ ద్వారా డిఆర్వోను ఆదేశించారు. పీజీఆర్ఎస్ కి సంబంధించి ఒక అర్జీ విలేజ్ సర్వేయర్ లాగిన్ లో చాలా రోజుల నుండి పెండింగ్ లో ఉండడం గమనించి వెంటనే ఆ విలేజ్ సర్వేయర్ ను సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ కర్నూలు ఆర్డీఓ ను ఆదేశించారు.. పీజీఆర్ఎస్ కి సంబంధించి అర్జీల వివరాలపై వీఆర్వో లకు పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వెల్దుర్తి మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన గ్రామంలో భూరీ సర్వే పనులు ఏ విధంగా జరుగుతున్నాయి ? గ్రౌండ్ ట్రూతింగ్ పనులు మొదలు పెట్టారా? రోజుకి ఎన్ని ఎకరాలు భూరీ సర్వే చేస్తున్నారు? ఎన్ని రోవర్లు ఉన్నాయి?ఎన్ని టీమ్ లు ఉన్నాయి? గ్రౌండ్ వ్యాలిడేషన్ కి ఎంత సమయం పడుతోంది? రీ సర్వే సమయంలో రైతులకు ముందుగానే నోటీసులు ఇస్తున్నారా?? అనే విషయాలను కలెక్టర్ తహశీల్దార్, మండల సర్వేయర్‌లను అడిగి తెలుసుకున్నారు.. అనంతరం కార్యాలయ సిబ్బంది గదులను మరియు రికార్డులు ఉన్న గదులను పరిశీలిస్తూ ఎంతమంది వీఆర్వోలు ఉన్నారు? కార్యాలయంలో సిబ్బంది ఎంతమంది ఉన్నారు అని కలెక్టర్ తహశీల్దార్ ను ఆరా తీశారు. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వద్ద ఉన్న మ్యూటేషన్ రికార్డ్స్ ను పరిశీలిస్తూ, ప్రతి మ్యూటేషన్ కు పక్కగా ఫైళ్లు నిర్వహించాలని,పి జి ఆర్ ఎస్ కు సంబంధించి వచ్చిన దరఖాస్తులను రిజిస్టర్ నమోదు చేసుకోవాలని, రికార్డ్స్ రూమును జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, మండల తహసిల్దార్ చంద్రశేఖర వర్మ, డిప్యూటీ తాసిల్దార్ గురు స్వామి రెడ్డి,ఎంపీడీవో సుహాసినమ్మ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ , ఆయా గ్రామాల రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

# అధికవడ్డీ పేరుతో రూ.ఐదుకోట్లకు వ్యక్తి టోకరా..!

**-అధిక వడ్డీలు ఆశాచూపి కోట్లు వసూలు చేసి వ్యక్తి పరార్.**
**-ఇరవై రోజులుగా కనిపించడం లేదని బాధితుల ఆవేదన.**
**-పోలీస్ స్టేషను ఆశ్రయించిన బాధితులు.**

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలంలో కెనరా బ్యాంకులో బిసినెస్ కరస్పాండెట్‌గా పనిచేయుచున్న ఆర్.హరికుమార్ రెడ్డి ప్రజలనుండి అధిక వడ్డీ పేరుతో ఐదు కోట్ల వసూలు చేసి పరారైన ఘటన ఆలస్యంగా వెలుగుచుసింది. మండల పరిధిలోని కంబదహాల్ గ్రామానికి చెందిన ఆర్. హరికుమార్ రెడ్డి సి. బెళగల్ కెనరా బ్యాంకులో బిసినెస్ కరస్పాండెంట్‌గా గత పది పదహేయిదు సంవత్సరాలు పనిచేయుచునాడు. ఇక్కడే ప్రజాల నమ్మకాని సొమ్ము చేసున్నాడు. బ్యాంకులో పనిచేసే వ్యక్తని అవసరాలకు ఆడుకుంటాడని భావించిన ప్రజలు, రైతులకు అధిక ఆశా చూపి అవసరం పేరుతో ప్రజల అకౌంట్ లోని డబ్బులను డ్రా చేయించుకొని వారికి




అధికవడ్డీ పేరుతో ఆశా చూపి సుమారు ఐదు కోట్లు తీసుకుని పరారయాడని, గత ఇరవై రోజులుగా ఇల్లు తాళం వేసి ఉండటంతో దిక్కుతోచని స్థితిలో అంత మోసపోయామని భావించిన సదురు బాధితులు మంగళవారం సి.బెళగల్ పోలీస్ స్టేషన్ నందు పిర్యాదు చేశారు. సదురు ఎస్ఐ. పిర్యాదు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# నాటుసారా నిర్మూలన కోసమే నవోదయం 2.0

**-నంద్యాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కృష్ణ మూర్తి**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :**నాటుసారా నిర్మూలన కోసమే నవోదయం2.0 అని నంద్యాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కృష్ణ మూర్తి అన్నారు. మంగళవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవి కుమార్ ఆదేశాల మేరకు నంద్యాల ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గడివేముల మండలం, కరిమద్దెల గ్రామానికి చెందిన వ్యక్తి నుండి 10 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకోవడం తో పాటు సదరు వ్యక్తిని రిమాండుకు పంపించడం జరిగిందన్నారు . తిరుపాడు గ్రామ పెద్దల ఆద్వర్యంలో గ్రామ సభను నిర్వహించి నాటు సారాయి దుష్ప్రభావాలు గురించి అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం తో పాటు నవోదయం 2.0 సంబందించిన కరపత్రాలను గ్రామం లో ప్రజలకు పంచుతూ నాటు సారా కు దూరంగా ఉండమని అవగాహన కల్పించారు. నాటు సారాయి, డ్రగ్స్ కు ఏ సమాచారము అయిన టోల్ ఫ్రీ నెంబర్ 14405 ఫోన్ చేయవచ్చునని లేదానంద్యాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ 9440902586,నంద్యాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్-ఇన్స్పెక్టర్, నంద్యాల్-7989409125 సమాచారం ఇవ్వాలని తెలిపారు.



# రోడ్డుకు ఇరువైపుల సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి



**పాములపాడు మేజర్ న్యూస్ :** కర్నూల్ నుండి విజయవాడ వెళ్తున్న జాతీయ రహదారి 340 సి చెలిమిల్ల రహదారికి వెళ్లే దారిలో నిర్మాణం జరుగుతుంది అయితే గత కొద్ది కాలంగా అండర్పాస్ బ్రిడ్జి ఎత్తున పెంచాలని డిమాండ్ చేస్తూ నిర్మాణాన్ని గ్రామస్తులు రైతులు ప్రజాసంఘాలు నాయకులు అడ్డుకున్నారు. మంగళవారం తహసిల్దార్ కార్యాలయంలో నేషనల్ హైవే అధికారులు తహసిల్దార్ సుభద్రమ్మ, ఎస్సై సురేష్ బాబు, ప్రజా సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి వారితో మాట్లాడారు జాతీయ రహదారి పనులకు అడ్డగించోద్దని సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు ప్రస్తుతం ఒకవైపు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తామని అధికారులు అన్నారు అయితే చెలిమెల్ల లింగాల వెళ్లే వైపున సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని వారు కోరారు హైవే వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఇక్కడ సర్వీస్ రోడ్డు లేదు అయినప్పటికీ పాములపాడు వైపు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తామని అన్నారు అయితే చెలిమిళ్ళ వైపే సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ప్రజా సంఘాల నాయకుల వినతి 2017-18 సంవత్సరంలో భూసేకరణ జరిగిందని అయితే అప్పటిలో తహసిల్దార్ కార్యాలయం, ఐకెపి భవనము, జూనియర్ కళాశాల, సచివాలయం భవనము, ఇక్కడ లేవని అప్పుడే పరిస్థితులకు అనుగుణంగా రోడ్డు మ్యాప్ రూపొందించారని ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రహదారి నిర్మాణంలో మార్పులు చేపట్టాలని తహసిల్దార్ సుభద్రమ్మకు ప్రజాసంఘాల నాయకులు రైతులు వినతి పత్రం అందించారు. లింగాల సర్పంచ్ మల్లేశ్వర్ రెడ్డి, చెలిమిళ్ళ సర్పంచ్ కోట్ల చంద్ర రెడ్డి, రైతు సంఘం నాయకులు స్వామన్న వెంక టేశ్వరరావు, సిపిఎం నాయకులు రాజు, రైతులు కోట్ల నాగేశ్వర్ రెడ్డి, రాజశేఖర్, పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన మార్కెట్ వేలాలు



మార్కెట్ వేలాలలో పాల్గొన్న దృశ్యం

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు మున్సిపాలిటీలోని రోజువారి,వారం,మార్కెట్లకు వేలాలు మంగళవారం నిర్వహించారు.పోలీసు బందోబస్త్ మధ్య మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అధ్యక్షతన 2025-26కు సంబందించిన బహిరంగా వేలాలు నిర్వహించారు. రోజు వారి మార్కెట్ మున్సిపాలిటీ వారి పాట రూ. 27,57,00 లక్షలు గాను కె. విద్యా రానెమ్మ రూ. 30లక్షల 35 వేలకు దక్కుంచుకున్నారు. వారపు మార్కెట్ మున్సిపాలిటీ వారి పాట రూ 6 లక్షల 93 వేలకు గాను కె.బీ వీరన్న రూ. 7 లక్షల 59 వేల 500కు దక్కుంచుకున్నారు. వారపు పశువుల మార్కెట్ మున్సిపాలిటీ వారి పాట రూ.15,62,00 లక్షలకు గాను రూ. 17 లక్షల 15 వేలకు కె. విద్యా రానెమ్మ దక్కుంచున్నారు. గొర్రెల మార్కెట్ మున్సిపాలిటీ వారి పాట రూ.15,66,00 లక్షలకు గాను రూ. 17 లక్షల 20 వేలకు కె. విద్యా రానెమ్మ దక్కించున్నారు. అలాగే గొర్రెల కమేళా మున్సిపాలిటీ వారి పాట రూ. 1,29,000కు గాను రూ.1లక్ష 42 వేలకు కె.హుసేనిఅలాందక్కించుకున్నారు. మాంసం మార్కెట్ మున్సిపాలిటీ వారి పాట రూ. 1,35000 గాను ఖలీల్ బాషా రూ.1 లక్ష 47 వేలకు వేలాలు దక్కించుకోవడం జరిగిందని కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 2024-25 కు మున్సిపల్ మార్కెట్ వేలాలు మొత్తం రూ. 68 లక్షల 42 వేలకు వేలాలు దక్కించుకోవడం జరిగిందన్నారు. ఈ వేలాల ద్వారా మున్సిపాలిటీకి రూ. 6 లక్షల 76 వేల 500 వచ్చినట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో అస్లాం, ఆర్ఐలు సూరిబాబు, షేక్షావలి సిబ్బంది, పాల్గొన్నారు.

# బాపురంలో శ్రీ శ్రీ గంగాభవానిదేవి రథోత్సవం

వైభవంగా శ్రీ శ్రీ శ్రీ గంగాభవానిదేవి రథోత్సవం



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల పరిధిలోని బాపురం గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ గంగాభవాని దేవి రథోత్సవం మంగళవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో అశేష భక్త జనవాహినుల మద్య అంగరంగ వైభవంగా జరిగింది.ముందుగా శ్రీ శ్రీ గంగాభవాని దేవికి ఉదయం నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఆకుపూజ. కుంకమార్చన. బిల్వార్చన. జలాభిషేకం. రుద్రాబిషేకం. పంచామృతాబిషేకం.తులసిఅర్చన గణపతి పూజ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6గంటల ప్రాంతంలో స్థానిక గంగాభవాని దేవాలయం మఠంనుండి శ్రీ శ్రీ గంగా భవానిదేవి అమ్మవారి వెండిఉత్సవ మూర్తిని. పల్లకి సేవలో ఉంచి అక్కడ నుండి మేళతాళలలు. డప్పులు. డ్రమ్స్ లతోను ఊరేగింపుగా పూలమాలలుతోఅలంకరించిన పుష్పరథం వరకు తీసుకెళ్లి అక్కడ శ్రీ శ్రీ గంగా భవాని దేవి వెండివిగ్రహన్ని పుష్పరథంపై ఉంచి మఠం పీఠాధిపతిరాలు శ్రీ శ్రీ బసలింగమ్మవ్వ స్వహస్త చేతులుమీదుగా శ్రీశ్రీ గంగాభవానిదేవి అమ్మా వారికి నైవేద్యములు అర్పించారు. ఆ తర్వాత శ్రీ శ్రీ బసలింగమ్మవ్వ రథాన్నికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అవ్వ స్వహస్తములతో రథోత్సవంను అశేష భక్తజనవాహినుల మద్య అంగరంగ వైభవంగా కమనీయం... రమణీయంగాను స్థానిక బసవన్న కట్టవద్దకు రథాన్ని లాగి మళ్లీ యథాస్థానంలో ఉంచారు. ఈరథాన్ని తిలకించేందుకు గ్రామం చుట్టుపక్కల ఆంధ్ర కర్నాటక రాష్ట్రంల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని తమ మొక్కులను తీర్చుకు అన్నారు.ఈ రథోత్సవం కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవం కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌రాలు మాలబసమ్మ.మంత్రాలయ నియోజకవర్గం టిడిపి ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి రామకృష్ణరెడ్డి. టిడిపి మండ అధ్యక్షుడు బసలదోడ్డి ఈరన్న. వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి. ఎంపిపి శ్రీ విద్య. చంద్రశేఖర రెడ్డి. వీరేష్ గౌడు. సిద్ధప్ప. చిన్న మహదేవ్. కడుబూరు. వీరేష్. నరసింహులు. నరసప్ప. చంద్ర ఎల్లప్ప.ఎంపిటిసి సభ్యులు బడెమ్మ.ముత్తమ్మ. బాపురం హనుమంత రెడ్డి. తెలుగు వీరేష్.టి. హనుమంతు.సాగునీటిసంఘం అధ్యక్షుడు చిన్న నారాయణ. తదితరులు పాల్గొన్నారు.

# కేసీ కెనాల్ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం..

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ , మేజర్ న్యూస్ :** కేసీ కెనాల్ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ రైతులకు హామీ ఇచ్చారు.నియోజకవర్గంలోని కేసీ కెనాల్ ఆయకట్టు రైతులకు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని చాలా ఇబ్బంది పడుతున్నామని ఆళ్లగడ్డ ఎంఎల్ఏ భూమా అఖిలప్రియ దృష్టికి కేసీ కెనాల్ రైతులు తెచ్చారు. రైతులకు నీరు తీసుకురావడం కోసం సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే భూమాఅఖిలప్రియ మాట్లాడారు. ఎమ్మెల్యే అఖిలప్రియ మాటలకు అధికారులు వెంటనే స్పందించారు.తుంగభద్ర నుండి 1.9 టిఎంసి నీటిని అందిస్తామని అధికారులుఎమ్మెల్యేకుతెలిపారు.అయితే ప్రస్తుతం తుంగభద్ర నుండికేసీ కెనాల్ కు నీరు రావడానికి వారం రోజులు పడుతుంది, కాబట్టి తాత్కాలికానికి సుంకేసుల నుండి 0.9 టీఎంసీ నీటిని కేసీ కెనాల్ కు వదలడం జరుగుతుందన్నారు. అంతలోపు తుంగభద్ర నుంచి 1.9 టీఎంసీ నీరు కేసీ కెనాల్ కు వస్తుందని అధికారులు ఎమ్మెల్యేకి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ కేసీ కెనాల్ చివరి ఆ యకట్టు వరకు సాగు నీరు అందిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అవసరమైతే సంబంధిత మంత్రులతో మాట్లాడి సాగనిరందిస్తామన్నారు.

# ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



**గడివేముల మేజర్ న్యూస్:** మండలంలోని బిలకల గూడూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎస్ఏరఫీ, టిడిపి యువ నాయకుడు ఎస్ఏకాలిక్ మంగళవారం నాడు మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు కఠోర దీక్షతో ఉపవాసం చేస్తారు. ఇంత నియమ నిష్టాలతో దీక్ష చేస్తున్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అలాగే మైనార్టీ సోదరుల కోసం పలు సంక్షేమ పథకాలను తెచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. టిడిపి పార్టీ పుట్టినప్పుడు నుంచి ముస్లిం సోదరులకు తగిన గౌరవం ఇ స్తుందని తెలిపారు. ముస్లిం సోదరులకు మరిన్ని పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రమే, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నా చంద్రబాబుకు సాధ్యమని మైనార్టీ టిడిపి నాయకులు యస్ ఏ రఫీక్, ఎస్ ఏ కలిక్ అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి సర్పంచ్ సహకారం మరువలేనిది.. మాండ్ర

- అట్టహాసంగా బండలాగు పోటీలు ప్రారంభం - మాండ్ర సన్మానించిన గ్రామ పెద్దలు



**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** బిజినేముల గ్రామ అభివృద్ధికి సర్పంచ్ రవి యాదవ్ అందిస్తున్న సహకారం సేవలు మరువలేనివని టిడిపిసీనియర్‌నాయకులు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి అన్నారు.శ్రీ గణపతి సహిత శ్రీ లక్ష్మీ సత్యనారాయణ స్వామి, శ్రీ సీతా లక్ష్మణ హనుమ సమేత, శ్రీ రామచంద్ర స్వామి, హనుమత్ ధ్వజ, వృషభ ధ్వజ, ఆలయ శిఖర సహిత, శ్రీ వీరాంజనేయ స్వామి, శ్రీ రాధాకృష్ణ ,వీరబ్రహ్మేంద్ర స్వాముల ప్రతిష్ట మహోత్సవ సందర్భంగా గ్రామ సర్పంచ్ రవి యాదవ్ ఆధ్వర్యంలో అంతరాష్ట్ర పెద్ద బండలాగు పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను టిడిపి నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి చెర్నకోల చేత పట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతు సంబరాల్లో భాగంగా బండ లాగు ఎద్దుల పోటీలు నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. అనంతరం శ్రీ శ్రీ శ్రీ కాశీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ కమిటీ పెద్దలు గ్రామ పెద్దలు సురేంద్రనాథ్ రెడ్డి ని పూలమాలవేసి జ్ఞాపికతో సత్కరించారు.

## పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల కేంద్రంలో స్థానిక ఎంపిపి(మైయిన్ పాఠశాల).ఆధిఆంధ్ర ప్రాథమిక పాఠశాలలను మంగళవారం మండల విద్యాశాఖ అధికారి రామ్మూర్తి -2 ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టించాలని సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే వేసవి కాలం ప్రారంభమైంది విద్యార్థులకు పాఠశాల లో తాగునీటి వసతి కల్పించాలన్నారు. ఎఫ్ఎ-4 పరీక్షలను తనఖీ చేయడం జరిగిందని. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రంగమ్మతోటి ఉపాధ్యాయులకు సూచనలు చేయడం జరిగిందని తెలిపారు.

## ఇసుక ట్రిప్పర్ పట్టివేత – కేసు నమోదు

**దొర్నిపాడుమేజర్,న్యూస్‌:** ఎలాంటి అనుమతులు లేకుండా జమ్మలమడుగు నుండి మండల కేంద్రమైన దొర్నిపాడుకు ఇసుకను సరఫరా చేస్తున్న ఎపీ391963 టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని టిప్పర్ డ్రైవర్ ఎర్రమాసి ప్రదీప్ కుమార్ తండ్రి ఏసన్న రామాపురం గ్రామం జమ్మలమడుగు మండలం వైఎస్.ఆర్ జిల్లా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ హనుమంత రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

## రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలి – ఎ.ఒ ప్రమీళ



సమావేశంలో మాట్లాడుతున్న ఎ.ఒ ప్రమీళ

**దొర్నిపాడుమేజర్,న్యూస్‌:** రైతులు రబీలో సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని ప్రమీళ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని చాకరాజువేముల బుర్రారెడ్డిపల్లె గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పంట నమోదు మార్చి 6వ తేదీ చివరి తేదీ అని రైతులు తప్పనిసరిగా ఆయా గారమాలలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లీ ఈ పంట నమోదు , ఈకేవైసి చేయించుకోవాలని రైతులకు సూచించారు. అలాగే రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని ఆమె అన్నారు. అలాగే రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకొని ప్రతి రైతు వ్యక్తిగత 11 అంకెల నెంబరును పొందాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని ప్రమీళ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## జాబ్ కార్డులు ఉన్న వారందరికీ ఉపాధి

# పనులను కల్పించాలి



**వెల్దుర్తి ,మేజర్ న్యూస్:** మండల పరిధిలోని అల్లుగుండు గ్రామ పంచాయితీ పరిధిలో జరుగుతున్న పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాష ఉపాధి కూలీలతో మాట్లాడుతూ జాబ్ కార్డులు ఉన్న వారందరికీ ఉపాధిహామీ పథకం కింద పనులన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు పనులకు ఏ సమయానికి వస్తున్నారు, ఎంత సేపు ఉంటారు, కూలీ ఎంత పడుతోంది అని కూలీలను అడిగి ఆరా తీశారు.వేసవి కాలం అయినందున ఉదయం త్వరగా పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. త్వరలో వేతనం మంజూరుకు సంబంధించి నిధులు విడుదల అవుతాయని కలెక్టర్ కూలీలకు తెలిపారు.అనంతరం అధికారుల తో మాట్లాడుతూ పనులు ఎక్కడ నుండి ఎక్కడ వరకు పెట్టారు, ఎంత మంది కూలీ లు పనులకు హాజరయ్యారు అని జిల్లా కలెక్టర్ మస్టర్ డేటా ద్వారా వెరిఫికేషన్ చేశారు.. ఎన్ఎం ఎస్ ఎస్ యాప్ లో అప్డేట్ చేస్తున్నారా, వేతనాలు ఎంత ఇస్తున్నారు, వేతనాలు ఇచ్చినట్లు కూలీలకు రిసీప్ట్ ఇస్తున్నారా అని కలెక్టర్ ఫీల్డ్ అసిస్టెంట్ ను అడిగి తెలుసు కున్నారు.ఆర్థిక సంవత్సరం మార్చి తో ముగియనందున కూలీలకు ఉపాధి పనులు కల్పించడంలో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ డ్వామా పిడిని ఆదేశించారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వ్యవసాయ పనులు ఉండవు కాబట్టి ఈ మూడు నెలల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒకరికి ఎక్కువ సంఖ్యలో ఉపాధి పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ భాష డ్వామా పిడిని ఆదేశించారు.ఫామ్ పాండ్ లను కర్నూలు జిల్లా లో ఒకప్పుడు బాగా చేసేవారని, అదే విధంగా ఇప్పుడు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం ఫామ్ పాండ్ లను తవ్వి నీటిని నిలువ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

**పలుగు చేత పట్టిన జిల్లా కలెక్టర్ :** ఉపాధి హామీ పనులను పరిశీలించిన సందర్భంలో జిల్లా కలెక్టర్ కాసేపు పలుగు చేత పట్టి కూలీలతో కలిసి మట్టి తవ్వి వారితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, డ్వామా పిడి వెంకటరమణయ్య, తహాశీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపిడిఓ సుహాసినమ్మ, ఎస్సై అశోక్,ఈ ఓఆర్డి రవి కిషోర్, వ్యవసాయ శాఖ అధికారి అక్బర్ బాషా,డ్వామా ఎపిడి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## గాదిలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసిన ఎంపి నాగరాజు



**హలహర్వి,మేజర్ న్యూస్ :** హాల హర్వి మండలంలోని గూళ్యం గ్రామంలో కొలువైన భక్తుల పాలిట కొంగు బంగారంగా నిలిచే శ్రీ గాదిలింగేశ్వర స్వామి జోడు రథోత్సవం వేడుకలు గూళ్యం గ్రామంలో ఘనంగా జరుగుతున్న సందర్భంగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగ రాజు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం గత పాలకులు చేసిన అప్పులను దృష్టిలో ఉంచుకొని అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని అన్నారు.అప్పుల ఊబి లో ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టుటకు చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. టిడిపి నాయకులు జీవన్, ఉమాకాంత్, జయరాం,శ్రీధర్ లు పాల్గొన్నారు.

## మహానంది క్షేత్రంలో వేలాల ద్వారా రూ.24.03 లక్షలు ఆదాయం



మహానంది క్షేత్రంలో వేలాలు నిర్వహిస్తున్న దృశ్యం

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహా నంది పుణ్య క్షేత్రంలో నిర్వహించిన వేలాల ద్వారా రూ. 24.03 లక్షల ఆదా యం లభించినట్లు ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవా రం పోచా బ్రహ్మానందరెడ్డి విశ్రాం తి భవనంలో నిర్వహించిన బహి రంగ, సీల్డ్ టెండర్లను నిర్వహిం చారు. ఈ వేలాల్లో ఉభయం టోల్‌గేట్ల నిర్వహన, పాదరక్షలు భద్రపరుచుకొను హక్కు, మరుగు దొడ్ల నిర్వహణ హక్కు వేలాలు వాయిదా పడ్డాయని అన్నారు. పచ్చి కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు సీల్డ్ టెండర్ ద్వారా ఉమాదేవి రూ. 14,51,199, జేఎస్‌డబ్ల్యు మరుగు దొడ్ల నిర్వహనకు హరీష్‌కుమార్ రూ. 5,50,000, సాంప్రదాయ దుస్తులు విక్రయించుకునే హక్కు కొరకు హరినాథ్ రూ. 11,07,000, భక్తుల వాహనాలకు పూజలు చేసుకునే హక్కుకు విష్ణుచరణ్ రూ. 2,50,099లకు, పెద్దనంది వద్ద ఖాళీ స్థలంలో హోటల్ నిర్వహణకు రూ. 16,000లకు మధుసూదన్ సీల్డ్ టెండర్ల ద్వారా దక్కించుకున్నారని అన్నారు. కార్యాలయం పక్కన ఖాళీ స్థలంలో హోటల్ నిర్వహణకు నెల ఒకటికి బాడుగకు ఎం రమేష్ రూ. 17,500లకు బహిరంగ వేలం ద్వారా దక్కించుకున్నారని అన్నారు. అలాగే దేవస్థానం భూముల బహిరంగ వేలం ద్వారా ఏడాదికి రూ. 44,100 ఆదాయం లభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మధు, గ్రూప్ దేవాలయాల ఈవో జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ మాసంలో ఉర్దూ పాఠశాలల పనివేళల్లో మార్పు



రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** రంజాన్ మాసంలో రాష్ట్రంలోని ఉర్దూ పాఠశాలలకు పనిచేవేళల మార్పు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపపారు. ఈమేరకు అమరావతి లో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రంజాన్ పవిత్ర మాసంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ముస్లిం ఉద్యోగులు సాయంత్రం పనివేళల ముగింపు కంటే ఒక గంట సమయం ముందుగానే బయటకు వెళ్లేందుకు అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం గత నెలాఖరులోనే ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు ఈనెల 3వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఉర్దూ విద్యా బోధన పాఠశాలల పని వేళలను మార్పు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు, తదితర సంస్థ నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు మార్పు చేశామన్నారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ముస్లిం ఉద్యోగులు మతపరమైన ఆచారాలు నిర్వహించుకోవడానికి ఒక గంట ముందుగా బయటకు వెళ్లేందుకు అనుమతించే నిర్ణయం మరియు ఉర్దూ పాఠశాలల పనివేళల మార్పుపట్ల సీఎం చంద్రబాబు నాయుడుకు ముస్లిం సమాజం తన తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## అప్పుల బాధతో యువ రైతు మృతి



మృతుడు ఆకుల కరుణాకర్

**దొర్నిపాడుమేజర్,న్యూస్ః** అప్పుల బాధ తాళలేక మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన యువ రైతు పురుగుల మందు త్రాగి ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు ఎస్.ఐ హనునమంత రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఆకుల కరుణాకర్ (21) తండ్రి రవి గత నాలుగు, ఐదు సంవత్సరాల నుండి గ్రామంలో కౌలుకు పొలం తీసుకొని సీడు పత్తిని సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత రెండు మూడు సంవత్సరాల నుండి పంట సరిగ్గా రాక దాదాపు 15లక్షలు అప్పును తీర్చలేక అప్పు ఇచ్చిన వారు ఇంటి దగ్గరికి వచ్చి వొత్తిడి పెంచడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఆదివారం పురుగుల మందు త్రాగడం జరిగింది. గమనించిన బంధువులు ఆళ్లగడ్డలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు పంపడం జరిగింది. కోలుకోలేక మృతి చెందడం జరిగిందని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు. మృతుడు కరుణాకర్‌ను గ్రామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మెన్ బొబ్బూరి వెంకట స్వామి పూలమాల వేసి తన సంతాపం వ్యక్తపరిచి కుటుంబాన్ని ఆదుకుంటామని ఆయన హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ హనుమంత రెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మెన్ బొబ్బూరి వెంకట స్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## లారీ ఢీకొని రిటైర్డ్ హాస్టల్ వార్డెన్ మృతి





మృతిచెందిన క్రిష్ణారెడ్డి (ఫైల్ ఫోటో)

**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ ః** లారీ ఢీకొని రిటైర్డ్ హాస్టల్ వార్డెన్ క్రిష్ణారెడ్డి మృతిచెందిన సంఘటన నగరంలోని బళ్లారి చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కల్లూరు ఎస్టేట్ పంచరత్న కాంప్లెక్స్ వీధిలో నివాసముంటున్న జి క్రిష్ణారెడ్డి(67)అనే వ్యక్తి ఉదయం వాకింగ్ నిమిత్తం ఇంటి నుండి బైక్‌పై దుర్గా హోటల్ వద్దకు వెళ్లి అక్కడ వాహనాన్ని నిలిపి వాకింగ్ చేసేవాడు. మంగళవారం కూడా అదేమాదిరిగా ఢీమార్ట్ వైపు వాకింగ్ చేసుకుంటూ వెళుతుండగా బెంగళూరు నుండి హైదరాబాద్ వైపు నుండి అతివేగంగా, అజాగ్రత్తగా వెళ్తున్న లారీ క్రిష్ణారెడ్డిని ఢీకొనడంతో దాదాపు 10అడుగుల దూరంలో ఎగిరిపడ్డి అక్కడి కక్కడే మృతి చెందాడు. క్రిష్ణారెడ్డి లద్దగిరిలో ఉన్న బిసి హాస్టల్‌లో వార్డెన్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యాడని అతనికి ఇద్దరు పిల్లలు సంతానం కలరు. లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## తెలంగాణ మద్యం పట్టివేత – ఇద్దరు అరెస్టు



మద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు

**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ ః** నగరానికి చెందిన బోయ వెంకటేష్,బోయ పురుషోత్తం అనే వ్యక్తులు తెలంగాణ నుండి మద్యం తెచ్చి అధిక రేట్లకు అమ్ముతుండగా మంగళవారం వారిని అరెస్టు చేసిన ట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిఐ చంద్రహాస్ తెలిపా రు. ఆయన తెలిపిన వివరాల మేరకు బోయ వెంకటేష్ తెలం గాణ నుంచి 48మద్యం బాటిళ్లను తెచ్చి ఉల్చాల రోడ్డు వద్ద విక్రయిస్తుండగా వారికి వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి అతని వద్ద ఉన్న 48మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. అదేవిధంగా బస్తిపాడు గ్రామానికి చెందిన బోయ పురుషోతత నాయుడు అదే ప్రాంతంలో 11డిపిఎల్ (నాటుసారా) విక్ర యిస్తున్నాడన్న సమాచారంతో అతన్ని అదుపులోకి తీసుకుని 11లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ చంద్రహాస్ తెలిపారు.

## విద్యుత్ లైన్‌మెన్ సేవలు అభినందనీయం

- విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు వెలుగులు
- విద్యుత్ ఇఇ శ్రీనివాసరెడ్డి




మాట్లాడుతున్న ఇఇ శ్రీనివాసరెడ్డి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** విద్యుత్ లైన్‌మెన్‌ల సేవలు అభినందనీయమని విద్యుత్ ఇఇ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏలాంటి పరిస్థితుల్లో నైనా లైన్‌మెన్‌లు సేవలు అందిస్తూ ప్రజలకు వెలుగులను అందస్తారని అన్నారు. నంద్యాల రూరల్ ఇఇ శ్రీనివాసులు ఆద్వర్యంలో నంద్యాల డివిజన్ కార్యాలయ ఆవరణంలో జాతీయ విద్యుత్ లైన్‌మెన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇఇ తో పాటు డీఇ రమేష్, ఏఇలు నాగరాజు, సుబ్బారావులు హాజరయ్యారు. ఇఇ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ లైన్‌మెన్‌లు 24 గంటలు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తారని అన్నారు. ప్రభుత్వం లైన్‌మెన్‌లను గుర్తించి వారి కోసం జాతీయ దినోత్సవాన్ని నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పట్టణ, రూరల్ లైన్‌మెన్‌లు, వివిధ సెక్షన్ల ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.